క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరిక..



కోస్గి: మండల పరిధిలోని బొల్వోస్‌పల్లి గ్రామానికి చెందిన పలువురు వార్డుమెంబర్లు, మాజీ ఉపసర్పంచ్‌తోపాటు పలువురు బీఆర్‌ఎస్ నాయకులు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డి, కొండప్ప, కృష్ణారెడ్డి, రాఘవేందర్‌రెడ్డితోపాటు పలువురు కాంగ్రెస్‌లో చేరగా తిరుపతిరెడ్డి పార్టీ కండువాలు వేసి పార్టీలో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం కోడంగల్‌లోని రేవంత్‌రెడ్డి స్వగృహంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పార్టీలో చేరారు. టీపీసీసీ మెంబర్ వార్ల విజయ్‌కుమార్, మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, అన్న కిష్టప్ప, బెజ్జు రాములుతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థిని ఎంపిక



మక్తల్: మండలంలోని కర్ని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి నందిని రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికై ందని పీఈటీ రూప శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4న వనపర్తి జిల్లా ఖిల్లాఘనపూర్‌లో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొని ప్రతిభచాటిందన్నారు. ఈ నెల 14 నుంచి 16 వరకు వనపర్తి జిల్లాలోని సోలిపూర్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు. అనంతరం విద్యార్థి నందినిని పలువురు అభినందించారు.

యువతికి అభినందన



ఊట్కూర్: మండలంలోని పెద్దపొర్ల గ్రామానికి చెందిన కోళ్ల నాగలక్ష్మి రెండు ఉద్యోగాలకు ఎంపిక కావడంపై గ్రామస్తులు అభినందించారు. గ్రామానికి చెందిన కోళ్ల కృష్ణయ్య, పద్మమ్మ దంపతులకు నలుగురు ఆడపిల్లలు పెద్ద కూతురు నాగలక్ష్మి మహబూబ్‌నగర్‌లో డిగ్రీ పూర్తిచేసింది. కోర్టులో ప్రాసెసర్ సర్వర్ అనే ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోగా నెలరోజుల కింద ఉద్యోగానికి ఎంపికకావడంతో కోర్టులో విధులు నిర్వహిస్తుంది. కాగా ఇటీవల పోలీస్ కానిస్టేబుల్ ఫలితాలు వెలువడంతో నాగలక్ష్మి సివిల్ పోలీస్ ఉద్యోగానికి ఎంపికైంది. యువతిరెండు ఉద్యోగాలకు ఎంపిక కావడంపై సర్పంచ్ రవికుమార్, ఉపసర్పంచ్ ఈశ్వర్, ఎంపీటీసీ శివ, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి కిరణ్ హర్షం వ్యక్తం చేశారు.

దెబ్బతిన్న రోడ్లు..



మరికల్: మండలంలోని కన్మనూర్ రహదారి దెబ్బతినడంతో వాహనదారులు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అధికలోడులతో వెళ్తున్న లారీలు, మొరం, ఇటుక, ఇసుక టిప్పర్లతో రహదారులు అధ్వానంగా మారుతున్నాయి. ఒక కిలో మీటర్‌కు పదుల సంఖ్యలో గుంతలు ఉండటంతో వాహనాలు గుంతలను తప్పించబోయి ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీ కొట్టడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల మరమ్మతులు చేసిన ఆత్మకూర్, కన్మనూర్, మాధవరం, తీలేర్ రహదారులు భారీ వాహనాల రాకపోకలకు అధ్వానంగా మారాయి.

అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేస్తా



ఆత్మకూర్: మక్తల్ నియోజకవర్గ ప్రజలు అవకాశం కల్పిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని వీజేఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కత్తేపల్లిలో డీ–6 కెనాల్ వద్ద సాగునీటిని అందించే మోటార్లను ప్రారంభించారు. గ్రామానికి చెందిన 30 మంది దళిత రైతులకు సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని వర్కటం దృష్టికి తీసుకెళ్లారు. డీ–6 కాల్వ నుంచి నీటిని తరలించేందుకు సహకరించాలని కోరడంతో రూ.1.75 లక్షలు వెచ్చించి రెండు 5 హెచ్‌పీ మోటార్లు, స్టార్టర్లు, పైపులను రైతులకు అందజేసి ప్రారంభించారు. ఈసందర్భంగా రైతులు వర్కటం జగన్నాథ్‌రెడ్డిని శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రైతులు కుర్మన్న, తిరుపతి, నర్సింహ, అర్జున్, బసన్న, దాసన్న, విష్ణు, కొండన్న, ఎల్లన్న, లక్ష్మన్న, నాగరాజు, గోపాల్, రామకృష్ణ, భాను తదితరులు ఉన్నారు.

శిథిలావస్థలో ప్రభుత్వాస్పత్రి భవనం

- వర్షం వస్తే అంతే సంగతులు
- 30 పడకలతో అరకొరగా వైద్యసేవలు
- ఇబ్బందులు పడుతున్న రోగులు
- పట్టించుకుని అధికారులు, ప్రజాప్రతినిధులు



మక్తల్‌లో శిథిలావస్థకు చేరిన సబ్‌సెంటర్

మక్తల్: ప్రభుత్వ ఆస్పత్రి నిజాంకాలం నాటి చారిత్రక కట్టడాలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. అయితే కనీసం వీటి మరమ్మతుకు కూడా ఎవరూ సాహసించడం లేదు. గతంలో పాత భవనానికి రంగులు వేసి చేతులు దులుపుకొన్నారు. ఆస్పత్రిలో ముగ్గురు వైద్యులు, ఇద్దరు ఫార్మసిస్టులు, ఐదుగురు స్టాఫ్‌నర్స్‌లు, 20 మంది వైద్యసిబ్బంది పనిచేస్తున్నారు. ఇతర సిబ్బంది, స్వీపర్లు మరో 12మంది వరకు ఉంటారు. ప్రతిరోజూ 250 మంది వరకు రోగులు చికిత్స చేయించుకుంటున్నారు. దీంతో సిబ్బంది సరిపడక మండలంలోని కర్ని ఆస్పత్రి నుంచి వైద్యసిబ్బంది ఇక్కడ ఉండి పనులు చేస్తున్నారు. 30 పడకల ఆస్పత్రి ఉన్నప్పటికీ స్థలం లేకపోవడం కేవలం కొన్నిమంచాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. డాక్టర్లకు ఒకగది మాత్రమే ఉంటుంది. అదే గదిలో రోగులకు చికిత్స అందిస్తున్నారు.

అందుబాటులో భవనాలు ఉన్నా..

నియోజకవర్గ కేంద్రంలో ఎన్నో ప్రభుత్వ భవనాలు రూ.లక్షలు వెచ్చించి. ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసి వదిలేశారు. వాటిలోకి ప్రభుత్వ ఆస్పత్రిని మార్చినా కొంత వరకు మేలు జరుగుతుంది. ఇప్పటికే ఆస్పత్రి భవనం నిర్మాణం లోపల పెచ్చులు ఊడిపోవడంతో ఎప్పుడు కూలుతుందోనని భయపడుతున్నారు. అధికారులు మాత్రం పాతవాటికి రంగులు వేసి చేతులు దులుపుకొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న సబ్‌సెంటర్ బాలింతలకు ఎన్నోఏళ్ల క్రితం నిర్మాణం చేసినప్పటికీ భవనాన్ని మరమ్మతు చేయడం లేదు. బాలింతలకు చికిత్స చేయాలంటే మరో గదిలో ఉండి చికిత్స అందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పినా ఫలితం లేకుండా పోయింది. సంబంధిత వైద్యులు మాత్రం ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రి మరమ్మతు కోసం రూ.10 లక్షలు మంజూరు చేసినా.. పోస్ట్‌మార్టం గదికి మాత్రం నిధులు మంజూరు చేయలేదు. ఆస్పత్రిలో కేవలం పదిమంచాల వరకు పరిమితం ఉందని, స్థలం లేకపోవడంతో రోగులకు మంచాలు వేయాలంటే లేని పరిస్థితి ఉంది. భవనాన్ని మరమ్మతు చేసేందుకు నిధులు కరువయ్యాయి. మరుగుదొడ్డి మరమ్మతు చేయకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. భవనాలు నిరుపయోగంగా మారుతున్నప్పటికీ అధికారులు చర్యలు మాత్రం శూన్యం.

నిధులు మంజూరు చేయండి..



నిజాంకాలం నాటి చారిత్రక కట్టడాలు శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. భవనానికి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలి. అధికారులు రంగులు వేసేందుకు నిధులు మంజూరు చేసి చేతులు దలుపుకున్నారు. వర్షాకాలంలో కురుస్తుందని పలువురు అంటున్నారు. రోగులు అవస్థలు పడుతున్నారు.

– కిరణ్, మక్తల్

ఉన్నతాధికారులకు తెలియజేస్తాం..

ప్రభుత్వ ఆస్పత్రిలో సమస్యల పరిష్కరించేందుకు ఉన్నతాధికారులకు తెలియజేస్తాం. మక్తల్‌కు 150 పడకల ఆస్పత్రికి ప్రభుత్వం రూ.34 కోట్లు మంజూరు చేసింది. రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చికిత్స అందిస్తున్నాం. భవన మరమ్మతు చేపట్టాలని ఉన్నతాధికారులకు తెలియజేస్తాం.

– డాక్టర్ చక్రధర్‌గౌడ్, ప్రభుత్వ ఆస్పత్రి

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం



ఇంటింటి ప్రచారంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు, తదితరులు

కోస్గి: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అమలు చేస్తామని ప్రకటించిన ఆరు గ్యారెంటీల కరపత్రాలతో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తుడుం శ్రీనివాస్, కౌన్సిలర్ మంజులతో పాటు పార్టీ నాయకులతో కలిసి ఏడోవార్డు పరిధిలోని కాలనీల్లో ఇంటింటి ప్రచారం చేస్తూ కరపత్రాలు పంచుతూ కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలని కోరారు. అలాగే మండల పరిధిలోని ముంగిమళ్లలో సుధాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుపయోగంగా భవనం



మాగనూర్: గృహనిర్మాణ సంస్థ సహాయక ఇంజినీర్ కార్యాలయం భవనం నిరుపయోగకరంగా మారింది. గతంలో గృహనిర్మాణలకు సంబంధించిన శాఖ అవసరాల నిమిత్తం భవనాన్ని నిర్మించగా, బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆ శాఖ అధికారులను ఇతర శాఖలో కలిపి వేయడంతో పదిసంవత్సరాలుగా భవనం నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం మండలంలో వివిధ అవసరాలకు భవనాల కొరత ఉందని, ఇతర శాఖల అధికారులకు కేటాయించి వినియోగంలోకి తేవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

భారీ మెజార్టీతో గెలిపించుకుందాం



చాకలోన్‌పల్లిలో పార్టీ కార్యకర్తల సమావేశంలో నాయకులు

దామరగిద్ద: బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, రాబోయే ఎన్నికల్లో భారీ మెజారిటీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని గెలిపించుకుందామని బీఆర్‌ఎస్ యూత్‌కమిటీ మండల ప్రధాన కార్యదర్శి బస్వరాజ్, జ్ఞానేశ్వర్, పుట్టి అంజి, అశోక్‌గౌడ్ అన్నారు. గురువారం మండల అధ్యక్షుడి ఆధ్వర్యంలో పిడెంపల్లి, ఉల్లిగుండం గ్రామాల్లో యూత్‌కమిటీ అధ్యక్షుడు బస్వరాజ్ ఆధ్వర్యంలో చాకలోన్‌పల్లి, యల్సాన్‌పల్లి గ్రామాల్లో ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలుచేస్తున్న ఆసరా పింఛన్‌లు, రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ, దళితబంధు, బీసీబంధు, గృహలక్ష్మి వంటి పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో భారీ మెజారిటీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు వెంకట్‌రెడ్డి, వీరారెడ్డి, బీఆర్‌ఎస్ ఎంపీటీసీలు, కృష్ణారెడ్డి, నర్సింహులు, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



మాగనూర్: మండలంలోని కొత్తపల్లి సమీపంలోని ప్రధాన రహదారి వెంబడిగల ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ బుడ్డీల చుట్టూ ముళ్లపొదలు పెరిగి కనిపించకుండా ఉందని, వ్యక్తులు, మూగజీవాలు అటుగా వెళ్లి ప్రమాదాల భారినపడే అవకాశాలు ఉన్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ముళ్లపొదలను తొలగించడంతోపాటు విద్యుత్‌కట్ట ఎత్తు పెంచాలని కోరుతున్నారు.

అసెంబ్లీ ఇన్‌చార్జిగా ఆంజనేయులుగౌడ్



మక్తల్: మక్తల్ నియోజకవర్గ అసెంబ్లీ ఇన్‌చార్జిగా బీఆర్‌ఎస్ తరపున తెలంగాణ క్రీడల ప్రాతిపదికార సంస్థ కార్పొరేషన్ చైర్మన్ ఆంజనేయులుగౌడ్‌ను నియమించింది. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మక్తల్‌కు చేరుకొని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానం చేశారు.

పత్తి పంటకు ఆశిస్తున్న తెగుళ్లు

- ఆందోళనలో రైతులు



హిందుపూర్‌లో పత్తిపంటలను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి సుదర్శన్‌గౌడ్ (ఫైల్)

కృష్ణా: మండలంలోని రైతులు పత్తిలో అధిక లాభాలు వస్తాయనే ఆశతో ఈ సంవత్సరం వేల ఎకరాల్లో పత్తి పంటలను సాగు చేశారు. కాగా గతకొంత కాలంగా సరైన వర్షాలు లేక పత్తి పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. మరి కొన్ని చోట్ల చౌడు, ఇసుక నేలల్లో సాగు చేసిన పంటలు ఇప్పటికే పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితుల కారణంగా పత్తితోపాటూ కంది, వరి పంటలు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇప్పటికే చాలా మంది రైతులు తమ పత్తిపొలాలకు వచ్చిన తెగుళ్ల నుంచి కాపాడుకోలేక పశువులకు వదిలివేస్తున్నారు. మరికొంతమంది రైతులు తమ పంటలను ఏలాగైనా కాపాడుకోవాలని తీవ్రంగా శ్రమిస్తున్నారు. ప్రస్తుతం పత్తిపొలాల్లో కాచిన పత్తినేలకు రాలడంతోపాటు పత్తికాయాలకు, చెట్లకు విపరీతమైన రోగాలు, తెగుళ్లు వ్యాపించాయి. వారం రోజుల్లో పత్తిని విడిపించాల్సిన పొలాల్లో పత్తి మొత్తం నేలకు రాలడంతో బాధిత రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. కాచిన పత్తిపోయిన ఉన్న పంటను కాపాడుకునేందుకు రైతులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈ పరిస్థితులలో వ్యవసాయ అధికారులు మండలంలోని పత్తిపంటలను పరిశీలించి రైతులకు సూచనలు సలహాలు ఇస్తున్నారు. ప్రతి వారం మూడు గ్రామాలను తాము సందర్శించి అక్కడి రైతుల పంటలను ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నామని వ్యవసాయ అధికారి సుదర్శన్‌గౌడ్ తెలియజేశారు. ఆ పంటలను కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతోపాటు ఆ పంటలకు వాడాల్సిన మందులను సూచిస్తున్నట్లు తెలిపారు.

యాజమాన్య పద్ధతులు

భూమిలో తేమ అధికంగా ఉన్నప్పుడు ఈ తెగులు పైరు అన్ని దశల్లో కనబడుతుంది. లేతమొక్కలు అర్ధంతరంగా ఎండిపోయి రాలిపోతుంది. వాడిపోయిన ఆకులు చాలకాలం పాటూ చెట్టుపై నుంచి కిందకు వేలాడుతూ కనబడుతాయి. ఈ తెగులుకు కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రామాలు లేదా కార్బండిజమ్ 1 గ్రామం లీటర్ నీటిలో కలిపిన ఆ ద్రావణాన్ని తెగులు సోకిన మొక్కలకు పిచికారి చేయాలి.

నల్లమచ్చ తెగులు

ఆకాశం భాగ మబ్బులు పట్టినప్పుడు ఈ తెగులు వ్యాపిస్తుంది. దీని ఉధృతిని బట్టి 3,4 పర్యాయాలు 15 రోజుల వ్యవధిలో 10 లీటర్ల నీటికి 1 గ్రామం పాషామైసిన్ లేదా ప్లాంటా మైసిన్ మరియు కాపర్ ఆక్సోక్లోరైడ్ 30 గ్రామాలు చొప్పున కలిపి పిచికారి చేయాలి.

పండాకు తెగులు

ఈ తెగులుకు 1 గ్రామం మెగ్నీషియం సల్ఫేట్‌తో పాటూ 2 శాతం యూరియా కలిపి 5, లేదా 7 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలని అధికారులు రైతులకు సూచిస్తున్నారు. రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు కార్యాలయ సిబ్బందిని సంప్రదిస్తే సలహాలు, సూచనలు ఎప్పటికప్పుడు అందిస్తామని వ్యవసాయ అధికారులు తెలియజేస్తున్నారు.



పత్తి పంటకు వ్యాపిస్తున్న తెగులు

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అల్పాహారం



లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అల్పాహారం అందజేస్తున్న ఆర్టీఓ

నారాయణపేటరూరల్: మానవత దృక్పథంతో సమాజంలో సాటిమానవుల ఆకలిని తీర్చిన వారే దైవసమానులని ఆర్టీఓ వీరస్వామి, లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ హరినారాయణ భట్టడ్ అన్నారు. శుక్రవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి వద్ద పేదలకు అల్పాఆహార అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంపాదనలో కొంత సమాజసేవాకు ఉపయోగించడం మానవ జన్మకు సార్ధకత లభిస్తోందని ప్రతి ఒక్కరు సేవా భావాన్ని అలవర్చుకోవాలని , సమాజ శ్రేయస్సు కోసం స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు యం. వెంకటయ్య, సాయినాథ్, కోశాధికారి రవిగౌడ్, సభ్యులు జనార్ధన్, శ్రీనివాస్ లాహోటి, ఆత్మరాం ఎడికే కాట్రగడ్డ విజయ్‌కుమార్, సత్యనారాయణ, సదానంద్‌చారి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధికూలీల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని క్రమంగా నిర్వీర్యం చేస్తుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్ అన్నారు. శక్రవారం ఉపాధికూలీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి నిధులు కేటాయించడంలో, పని కల్పించడంలో వైఫల్యం చెందుతుందన్నారు. ఉపాధిహామీ చట్టానికి గత బడ్జెట్‌తో పోలిస్తే ఈ సారి 30శాతం నిధులు తగ్గించి కూలీల కడుపు కొట్టిందన్నారు. సకాలంలో బిల్లులు రాక కూలీలు నిరాశ చెందుతున్నారన్నారు. వలసల నివారణకోసం గ్రామాల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలని ఎన్నోపోరాటాల అనంతరం సాధించుకున్న ఉపాధిహామీ పథకం పకడ్బందీగా అమలుచేసి గ్రామాల్లో కూలీలకు పనులు చేయించడంలో నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ఈ పరిస్థితుల్లో మళ్లీ వలసలు పెరుగుతున్నాయన్నారు. ఉపాధిహామీ పనిచేస్తున్న కూలీలకు సంవత్సరానికి రూ.200రోజులు పని కల్పిస్తూ రోజుకు రూ. 600ల చొప్పున వేతనాలు మంజూరు చేయాలని, సంవత్సరానికి కేంద్ర బడ్జెట్‌లో ఉపాధిపథకానికి రెండు లక్షల కోట్లు కేటాయించాలని, జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ కూలి బంధుపథకం కింద నెలకు రూ. 5 వేల చొప్పున ఇవ్వాలని, పనిప్రదేశాల్లో సౌకర్యాలు టెంటు, నీళ్లు, మెడికల్ కిట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు బాలప్ప, జిల్లా నాయకులు శివకుమార్, మల్లేశ్, నర్సింహులు, తిప్పన్న, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి హన్మంతు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు



మాగనూర్‌లో బతుకమ్మలతో పాఠశాల ఉపాధ్యాయులు, చిన్నారులు



బతుకమ్మలను నిమజ్జనానికి తరలిస్తున్న విద్యార్థులు

మాగనూర్: మండల కేంద్రంలోని శ్రీ ప్రతిభ విద్యానికేతన్ పాఠశాలలో శుక్రవారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మహేశ్వరి మాట్లాడుతూ.. చిన్నారులకు బతుకమ్మ పండగ ప్రాముఖ్యతను తెలియజేశారు. అనంతరం బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేశారు. ఉపాధ్యాయులు మధుసూదన్, సంధ్య, భారతి, ప్రియాంక, నర్సింహులు, మోనేష్ పాల్గొన్నారు.

ఈసీ అనుమతితో బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి

కోస్గి: ఎన్నో సంవత్సరాలుగా ఆగిపోయిన ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ ఎన్నికల సందర్భంగా ఆగిపోయాయని, ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకొని రాష్ట్ర విద్యాశాఖ ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం కోస్గిలో తపస్ జిల్లా అధ్యక్షుడు శేరి కృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన తపస్ జిల్లా కార్యవర్గ సమావేశానికి ఎమ్మెల్సీ హాజరై మాట్లాడారు. బకాయిలుగా ఉన్న డీఏ, పీఆర్‌సీలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల పాలిట శాపంగా ఉన్న నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీలు లేకుండా చూడాలన్నారు. ఉపాధ్యాయ సమస్యలను ఎప్పటికప్పుడు విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నామన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మంత్‌రావు మాట్లాడారు. పదోన్నతులకు నోచుకోకుండానే ఎందరో ఉపాధ్యాయులు పదవి విరమణ చేయడం బాధకరమన్నారు. అధికారులు పదోన్నతులు, బదిలీ ప్రక్రియ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ బాల్‌రాజ్, జిల్లా గౌరవ అధ్యక్షుడు మల్లికార్జున్, నాయకులు నర్సింహ, కిషోర్ కుమార్, నాగరాజు, వెంకట్‌రాములు, తిరుపతయ్య, అంజిలయ్య, వెంకటేష్, తుల్జారాంతో పాటు జిల్లా పరిధిలోని మండలాల బాధ్యులతో పాటు వందల సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ఆత్మకూర్: ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో ఎస్సై నరేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు స్థానిక గాంధిచౌక్‌లో, పరమేశ్వర స్వామి చెరువువద్ద వాహనాలు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహనాల్లో నగదు తరలింపు, డ్రంక్‌డ్రైవ్, హెల్మెట్లు, ఆర్సీ, లైసెన్సులు పరిశీలించారు. ట్రాఫిక్ రూల్స్‌ను తప్పనిసరిగా పాటించాలని వహనదారులకు సూచించారు.